సాక్షి
ములుగు

మంగళవారం | 27 | మే | 2025



పుష్కరాలను చాలెంజ్‌గా తీసుకున్నాం..

సరస్వతీనది పుష్కరాలను చాలెంజ్‌గా తీసుకున్నామని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.

- 8లో▸



పీహెచ్‌డీ పట్టాలకు ఫీజు..

కేయూ 23వ స్నాతకోత్సవంలో పట్టాలు పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కేయూ అధికారులు తెలిపారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $35^0/26^0$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు



ములుగు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్ 2న కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 15 నుంచి క్యాంపులు

ములుగు: వచ్చే నెల జూన్ 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ధర్తీ ఆబా జన్‌జాతి ఆదివాసీ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ క్యాంపులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ క్యాంపులను నిర్వహించే క్రమంలో ప్రజల నుంచి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, పీఎంజేవై, కులం, కిసాన్ క్రెడిట్ కార్డు, కేసీసీ, పీఎం కిసాన్, జన్ ధన్ బ్యాంక్ అకౌంట్ ఇన్సురెన్స్ కవరేజ్, పింఛన్లు ఎంప్లాయిమెంట్ అండ్ లివింగ్ హోల్ స్కీంలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

ములుగు/కన్నాయిగూడెం: జిల్లాలోని వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ కలెక్టర్ దివాకర సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు మండల పరిధిలోని జాకారం పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న గడ్డం రమాదేవి మల్లంపల్లి మండలంలోని దేవనగర్ పంచాయతీకి బదిలీ అయ్యారు. కన్నాయిగూడెంలోని ముప్పనపల్లిలో పనిచేస్తున్న సాగర్ మంగపేట మండలం రాజుపేటకు బదిలీ అయ్యారు. అలాగే మంగపేట మండలంలోని రాజుపేటలో పనిచేస్తున్న కుంజ సురేశ్ కన్నాయిగూడెం మండలంలోని ఏటూరు పంచాయతీకి బదిలీ అయ్యారు. మంగపేట మండలంలోని కమలాపురంలో పని చేస్తున్న కొందూరి కిశోర్ కుమార్ వాజేడు మండలం పేరూరుకు బదిలీ అయ్యారు. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌కు మంగపేట మండలంలోని కమలాపురంకు డిప్యుటేషన్‌పై పంపిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిట్యాల: కాళేశ్వరం జోన్-1 పరిధి జిల్లాలోని చిట్యాల, కాటారం, భూపాలపల్లి(బాలికలు), ములుగు జిల్లాలోని జాకారం, ఏటూరునాగారం (బాలురు), ములుగు (బాలికలు) పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్, డీసీఓ టీజీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ చిట్యాల ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28న తెలుగు, హిందీ, ఇంగ్లిషు, హెల్త్ సూపర్‌వైజర్ నియామకానికి, 29న గణితం, సైన్స్, సోషల్, లైబ్రేరియన్ సబ్జెక్టులకు, 30న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల(బాలుర) జాకారంలో పాఠ్యాంశ బోధన డెమోలు ఉదయం 9నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

టీచర్ల శిక్షణ శిబిరం మార్పు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో మంగళవారం(నేడు) నుంచి 31 వరకు నిర్వహించనున్న ఉన్నత పాఠశాలల టీచర్లకు శిక్షణకు సంబంధించి శిబిరాన్ని హసనపర్తి మండలం ఎర్రగట్టుగుట్ట వద్ద గ్రీన్‌వుడ్ పాఠశాలకు మార్చినట్లు హనుమకొండ డీఈఓ డి.వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం ఉపాధ్యాయులకు, అలాగే ఉమ్మడి జిల్లాలోని భౌతికశాస్త్రం, జీవశాస్త్రం ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు తొలుత పెద్దపెండ్యాలలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శిక్షణ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అనివార్య కారణాలతో శిక్షణ వేదిక మార్చినట్లు పేర్కొన్న డీఈఓ.. ఈ విషయాన్ని సంబంధిత ఉపాధ్యాయులు గమనించాలని కోరారు.





పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు





హారతి తీసుకుంటున్న భక్తులు, నదికి నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీ పండితుడు



నీళ్లు వదులుతున్న యువతి, పుష్కరిణికి నమస్కరిస్తున్న యువతులు



పుష్కరిణి వద్ద భక్తుల కోలాహలం



కాలినడకన పుష్కర స్నానాలు ఆచరించడానికి వస్తున్న భక్తజనం

పుష్కరం.. అనుభూతి పుష్కలం!

- ముగిసిన సరస్వతీ నది పుష్కరాలు
- చివరి రోజు లక్ష మంది భక్తుల రాక
- ఆకట్టుకున్న నవరత్న మాల హారతి

పుష్కర స్నానాలు ఆచరించిన భక్తులు పునీతులయ్యారు. కాళేశ్వరం సందర్శనలో జ్ఞాపకాల్ని మూటగట్టుకెళ్లారు. ఎండ, వాన.. గాలి దుమారం.. ఇవేవీ వారిని అడ్డుకోలేదు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్.. నదీ పరిసరాల్లో బురద.. వారి సంతోషానికి అడ్డు కాలేదు. కిక్కిరిసిన భక్తులతో ఆర్టీసీ బస్సులు. దారి పొడవునా ప్రైవేట్ వాహనాలు. ఇలా.. లక్షలాది మంది భక్తులు కాళేశ్వరానికి వచ్చారు. నదీ మాతకు పూజలు చేశారు. తర్పణాలు వదిలారు. పిండ ప్రదానాలు చేశారు. నదిలో దీపాలు వదిలారు. చీరెసారె సమర్పించారు. 17 అడుగుల సరస్వతీమాత విగ్రహాన్ని దర్శించుకున్నారు. కాళేశ్వర ముక్తీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. నదీమాతకు నవరత్న మాల హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సోమవారంతో సరస్వతీ నది పుష్కరాలు ముగిశాయి. చివరిరోజు లక్ష మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించారు.

- వివరాలు, మరిన్ని ఫొటోలు 8లో▸



హోమం చేయిస్తున్న పూజారులు, పాల్గొన్న భక్తులు

వినతులు పరిష్కరించండి..

- ప్రజావాణిలో 40, గిరిజనదర్బార్‌లో 15 ఫిర్యాదులు
- స్వీకరించిన కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

ములుగు/ఏటూరునాగారం: జిల్లాలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి, గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యలపై బాధితులు వినతులు విన్నవించి పరిష్కరించాలని ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 40 ఫిర్యాదులు రాగా కలెక్టర్ దివాకర స్వీకరించారు. ఏటూరునాగారంలోని ఐటీడీఏలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో 15 వినతులు రాగా పీఓ చిత్రామిశ్రా స్వీకరించారు. మొత్తంగా వచ్చిన 55 వినతులను పరిశీలించిన అధికారులు ఆయా శాఖల అధికారులకు సిఫారసు చేశారు. వాటిని తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

గిరిజన దర్బార్‌లో..

వాజేడు మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం ప్రాంతానికి చెందిన గిరిజనులు బోరు మంజూరు చేయాలని కోరారు. ములుగు మండలం బంజరుపల్లిలో సమ్మక్క- సారక్క గాల్ఫర్ మిషన్ వెల్ఫేర్ సొసైటీకి ఐటీడీఏ పరిధిలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో పారిశుద్ధ్యం, క్లీనింగ్‌కు కల్చర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంకులను క్లీనింగ్ చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. గూడూరు మండలం ఏపూర్ గ్రామానికి చెందిన వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వాంకుడోతు శరత్‌కు నేర చరిత్ర ఉందని, అతనిని ఉద్యోగం నుంచి తొలగించాలని విన్నవించారు. జిల్లాలోని పలువురు గిరిజన విద్యార్థులు ఆర్‌డీ జూనియర్ కళాశాలలో చదువుతున్నామని దానిని తొలగిస్తున్నారని, వేరే కళాశాలలో చేరే ఆర్థిక స్థోమత తమకు లేదని అందుకని కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సీటు ఇప్పించాలని కోరారు. 2017-2018లో బెస్ట్ అవైలబుల్ స్కీంలో సీట్లు పొందామని, 2023 - 2025 వరకు బిల్లులు రాలేదని ఫీజు చెల్లిస్తేనే పై తరగతులకు పంపిస్తామని అంటున్నారని బాధితులు గోడువెల్లబోసుకున్నారు. రెండు సంవత్సరాల ఫీజును ప్రైవేట్ స్కూళ్లకు చెల్లించాలని పీఓను కోరారు. మండలంలోని బూటారంకు చెందిన గిరిజనుడు జీఎంసీ ములుగులో మెస్‌ఫీజు చెల్లించాలని కోరారు. ఇలా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఓకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి, జీసీసీ డీఎం ప్రకాశ్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర పక్కన అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ప్రజావాణి వినతులు ఇలా..	
భూ సమస్యలు:	13
గృహ నిర్మాణ శాఖ:	15
పింఛన్లు:	2
ఇతర శాఖలు:	10

మూడు నెలల బియ్యం పంపిణీ

- అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు: జూన్ నెలలో ఒకేసారి మూడు నెలల సన్నబియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం కోటాను ఒకేసారి జూన్‌లోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి జాప్యం లేకుండా చేయకూడదని రవాణా కాంట్రాక్టర్లకు సూచించారు. డీలర్లు కూడా మూడు నెలల బియ్యం తీసుకోవడానికి వచ్చిన ప్రతీ లబ్ధిదారుడి వేలిముద్ర మూడుసార్లు నమోదు చేయించి పంపిణీ చేయాలని ఆదేశించారు. మండల్ లెవెల్ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్‌లు హమాలీలను సరిపడా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలందరూ మూడు నెలల సన్నబియ్యాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్లు, సివిల్ సప్లయీస్ డీటీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సేన్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ రాంపతి, ఏటూరునాగారం డివిజనల్ మేనేజర్ వాని ఠాగూర్, వెంకటాపురం జీసీసీ మేనేజర్ స్వామి, ములుగు, ఏటూరునాగారం డిప్యూటీ తహసీల్దార్లు, మండల లెవల్ స్టాక్ పాయింట్, గోదాం ఇన్‌చార్జ్‌లు, మండలాల డీలర్ల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌జీ

‘ఆపరేషన్ కగార్’ను వెంటనే నిలిపివేయాలి

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ములుగు: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. జిల్లా కేంద్రంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమై కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ దివాకరకు అందించారు. అనంతరం నిర్వహించిన సభలో విమలక్క మాట్లాడుతూ బీజాపూర్, నారాయణపూర్, కర్రెగుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మావోయిస్టు నాయకులు నంబాల కేశవరావుతో పాటు మరో 26 మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ యుగేంధర్, రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెల్తూరి సదానందం, ఉపాధ్యక్షుడు మోకాళ్ల సమ్మన్న, ఏఐ ఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్, అరుణోదయ ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచామృత అభిషేకాలు.. పడిపూజ



అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న పండితులు



హాజరైన భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం గత నెల 16న ప్రతిష్ఠించగా సోమవారానికి 41వ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో ఆలయంలో పంచామృత అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రమణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, హోమం వేదపండితులు రామకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కొబ్బరికాయలు కొట్టి శివలింగానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి పడిపూజ నిర్వహించి జ్యోతులు వెలిగించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి ఆలయ చైర్మన్ గౌరీశంకర్, శ్రీనివాస్, గోపి, లక్ష్మణ్, సత్యం పాల్గొన్నారు.

రవాణా శాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన!

ఎంవీఐలే డీటీఓలు.. పలుచోట్ల ఇదే పరిస్థితి

- హనుమకొండ డీటీఓగా జూనియర్‌కు బాధ్యతలు
- తెరవెనుక చక్రం తిప్పుతున్న సీనియర్లు
- విచారణలు, ఆరోపణలున్నా.. కుర్చీలు వదలని అధికారులు
- ఆదాయం ఉన్న పోస్టింగ్‌ల కోసం ఇంకా పైరవీలు

సాక్షిప్రతినిధి, వరంగల్ :

రవాణా శాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోంది. కోర్టు స్టే కారణంగా కొద్ది రోజులుగా ఆ శాఖలో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) జాబితాకు బ్రేక్ పడింది. దీంతో పదోన్నతులు, నియామకాలు నిలిచాయన్న సాకుతో చాలాచోట్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)లనే ఇన్‌చార్జ్ జిల్లా రవాణా శాఖాధికారులు(డీటీఓ)గా నియమించారు. మరికొందరు ఎంవీఐలకు.. ఎంవీఐతో పాటు ఇన్‌చార్జ్ డీటీఓలుగా ఒకేచోట పనిచేసే అవకాశం కల్పించారు. కాగా కొందరు ఎంవీఐలు ఇన్‌చార్జ్ డీటీఓ పోస్టును పోటీపడి తెచ్చుకున్న సందర్భాలుంటే.. మరికొన్నిచోట్ల జూనియర్లను డీటీఓలుగా తెరమీద పెట్టి సీనియర్లు తెరవెనుక చక్రం తిప్పుతున్నారన్న టాక్ వినిపిస్తోంది.

ఇప్పుడు కూడా ఇష్టారాజ్యం..

ఉమ్మడి వరంగల్ ఆరు జిల్లాల్లో డీటీసీ, డీటీఓ పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో పదోన్నతులు నిలిపివేసి ఒక్కో సీనియర్ ఎంవీఐకి రెండు నుంచి నాలుగు జిల్లాల్లో ‘ఆన్ డిప్యూటేషన్ పోస్టింగ్’లు ఇచ్చి పెద్ద ఎత్తున దండుకున్నారన్న ఆరోపణలపై విచారణ జరిగింది. ఇందులో కీలక సూత్రధారిగా ఉన్న ఓ అధికారి ప్రభుత్వం మారాక స్వచ్ఛంద పదవీ విరమణ పెట్టుకోవడం కొసమెరుపు కాగా.. అతడికి అండగా నిలిచిన కొందరు ఏసీబీ కేసుల్లో ఇరుక్కొని సస్పెండయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరు ఇన్‌చార్జ్‌ల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌లోని కొందరు పెద్దల ఆశీస్సులతో పలువురు పదోన్నతులు, హోదాలతో పని లేకుండా ఎంవీఐలు ఇన్‌చార్జ్ డీటీఓలు, డీటీసీలుగా వ్యవహరిస్తున్నారు. అక్కడితో ఆగకుండా పొరుగు జిల్లాల బాధ్యతల కోసం పైరవీలు చేయడంపై చర్చ జరుగుతోంది.

పాతుకుపోయారు..

ఉమ్మడి వరంగల్‌లో ఏళ్లతరబడి పాతుకుపోయిన కొందరు రవాణాశాఖ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ స్థాయిలో పైరవీలు చేసుకుంటూ కోరుకున్న పోస్టుల్లో కొనసాగుతున్నారనే చర్చ జరుగుతోంది. భూపాలపల్లి కార్యాలయంలో కీలకంగా ఉన్న ఓ అధికారి నాలుగేళ్లుగా అక్కడే తిష్ట వేశారు. వివిధ పోస్టుల్లో అక్కడే పాతుకుపోవడంతో పాలన గాడి తప్పి అవినీతి పెరిగిందన్న ఆరోపణలున్నాయి. హనుమకొండ డీటీఓ ఆఫీసులో తెరవెనుక చక్రం తిప్పుతున్న ఓ కీలక అధికారి సుమారు పదేళ్లుగా ఉమ్మడి వరంగల్‌లో వివిధ చోట్ల పనిచేసి పాతుకుపోయారన్న చర్చ ఉంది. ఏడాది క్రితం హనుమకొండకు బదిలీ కాగా.. కొద్ది రోజులకే ఏసీబీ దాడులు జరిగాయి. ఈ కేసులో డీటీసీ పుప్పాల శ్రీనివాస్ సస్పెండ్ కావడం కలకలం రేపింది.



హనుమకొండ రవాణా శాఖ అధికారి కార్యాలయం

కీలక పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లు..

- హనుమకొండ డీటీఓ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ)గా ఉన్న పుప్పాల శ్రీనివాస్‌పై అక్రమాస్తుల ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ దాడులు చేయగా సస్పెండయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో కరీంనగర్ డీటీసీ పురుషోత్తంకు ఇన్‌చార్జ్ డీటీసీ బాధ్యతలు అప్పగించారు.
- హనుమకొండ డీటీఓ పోస్టు ఖాళీ కావడంతో వాస్తవానికి అదే కార్యాలయంలో సీనియర్‌గా ఉన్న 1994 బ్యాచ్‌కు చెందిన రమేశ్‌రాథోడ్‌కు ఇన్‌చార్జ్ డీటీఓగా ఇవ్వాల్సి ఉంది. అయితే కీలక పోస్టులో ఉండటం ఇష్టం లేక ఆతను ఆసక్తి చూపకపోవడంతో 2012 బ్యాచ్‌కు చెందిన వేణుగోపాల్‌కు ఇన్‌చార్జ్ డీటీఓగా నియమించినట్లు ప్రచారంలో ఉంది.
- మహబూబాబాద్ గౌసుపాషా ఏసీబీకి చిక్కడంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆయన స్థానంలో వరంగల్ ఎంవీఐ జైపాల్‌రెడ్డిని ఇన్‌చార్జ్ డీటీఓగా నియమించారు.
- ములుగు డీటీఓ సిరాజ్ రెహమాన్ ఉద్యోగ విరమణ చేశాడు. అక్కడ ఎంవీఐ, డీటీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిరాజ్ రిటైర్మెంట్ తర్వాత ఆయన స్థానంలో పెద్దపల్లి ఎంవీఐ బి.శ్రీనివాస్‌ను ఇన్‌చార్జ్ డీటీఓగా నియమించారు. ప్రస్తుతం ములుగు ఎంవీఐ, ఇన్‌చార్జ్ డీటీఓగా కూడా శ్రీనివాసే వ్యవహరిస్తున్నారు.
- జేఎస్ భూపాలపల్లి ఇన్‌చార్జ్ డీటీఓ వేణు బదిలీ తర్వాత ఎవరినీ నియమించ లేదు. అక్కడ ఎంవీఐగా ఉన్న సంధానికే ఇన్‌చార్జ్ డీటీఓ బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుతం భూపాలపల్లి ఎంవీఐ, ఇన్‌చార్జ్ డీటీఓగా సంధానీ పని చేస్తున్నారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 8న వరంగల్ డీటీఓ లక్ష్మిపై బదిలీ వేటు పడింది. డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌పై ఏసీబీ దాడులు జరిగిన మరుసటి రోజే లక్ష్మిని బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. ఆమె స్థానంలో ఎంవీఐ శోభన్‌బాబు ఇన్‌చార్జ్ డీటీఓగా వ్యవహరిస్తున్నారు.

అడవుల్లో ప్లాస్టిక్ పడేయొద్దు

- ఎఫ్ఆర్ఓ అబ్దుల్ రెహమాన్

ఏటూరునాగారం: అడవుల్లో ఎక్కడ కూడా వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను పడవేయద్దని అటవీశాఖ సౌత్ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ డ్రైవర్లు, ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లకు ఆయన సోమవారం అవగాహన కల్పించి మాట్లాడారు. అడవుల్లో ఉండే వన్యప్రాణులకు ప్లాస్టిక్ వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ చల్లా శ్రీనివాస్‌తో పాటు డ్రైవర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్ఓ రెహమాన్

పుష్కరం.. పరిసమాప్తం


పుష్కరుడికి నమస్కరిస్తున్న యువతులు



నదిలో భక్తురాలి పూనకం


నదిలో ప్రమిదలు వదులుతున్న మహిళలు

ముగిసిన సరస్వతీనది పుష్కరాలు
- 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహణ
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు, ముక్తీశ్వరస్వామి ఆలయంలో దర్శనాలు
- చివరి రోజు లక్షకుపైగా భక్తుల రాక
- ప్రముఖుల పూజలు


నదిలో పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు




నదికి నీరు వదులుతున్న మహిళ

భూపాలపల్లి/కాళేశ్వరం: పన్నెండు రోజులు అత్యంత వైభవంగా జరిగిన సరస్వతీనది పుష్కరాలు పరిసమాప్తమయ్యాయి. ఈనెల 15న ఉదయం 5.44 గంటలకు మెదక్ జిల్లా రంగంపేటకు చెందిన పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి పుష్కరాలను ఘనంగా ఆరంభించారు. దీంతో 12 రోజులుగా భక్తజనం లక్షలాదిగా తరలివచ్చి పుష్కరిణిలో స్నానాలు ఆచరించి శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భక్తులు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. ముందు గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీనదిలో పుష్కర స్నానాలు చేశారు. పిండ ప్రదాన పూజలు, తర్పణాలు, సంకల్ప పూజలు చేశారు. నదీమాతకు పూజలు నిర్వహించారు. చీర, సారె, నైవేద్యం సమర్పించారు. సరస్వతి ఘాట్ వద్ద 17 అడుగుల ఏకశిలా సరస్వతిమాత విగ్రహాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి బారులుదీరారు.

చివరి రోజు లక్షకుపైగా..

ఉదయం నుంచి రాత్రి వరకు చివరి రోజు వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు భారీగా తరలి రావడంతో రద్దీ నెలకొంది. ఉదయం నుంచి పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపారు. అనంతరం ఆటోలు, అధికారులు ఏర్పాటు చేసిన షటిల్ బస్సుల్లో పుష్కర ఘాట్లకు తరలివెళ్లారు. రాత్రి వరకు లక్షకుపైగా మంది భక్తులు పుష్కర స్నానాలు చేసి ముక్తీశ్వరస్వామి ఆలయంలో దర్శనాలు చేసుకున్నట్లు అధికారుల అంచనా.

ప్రముఖుల పూజలు..

కాళేశ్వరంలోని సరస్వతీనదిలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీఎస్ రామకృష్ణరావు, స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్ దంపతులు, ప్రవచన కర్త నాగఫణి శర్మ, ఆర్ అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్‌నాయక్ పుష్కర స్నానాలు ఆచరించి విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు.

కలెక్టర్, ఎస్పీ పరిశీలన..

గోదావరి ఘాట్, పార్కింగ్ స్థలాలు, ఆలయ పరిసరాల్లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే పరిశీలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ క్లియర్ చేశారు. అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు.

ముగిసిన హోమాలు..

కాళేశ్వరం : రాష్ట్ర ప్రజల సంపద, ఆరోగ్య వృద్ధి, పాడిపంటల శుభ ఫలితాల కోసం 12 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన హోమాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. శ్రీ కాళేశ్వరముక్తీశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆర్థిక, శారీరక శ్రేయస్సు, వ్యవసాయోత్పత్తి అభివృద్ధికి శుభపరిణామాలు కలగాలనే ఆకాంక్షతో పుష్కరాల సమయంలో 12 రోజుల పాటు 12 హోమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రావు, ఈఓ మహేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.


నదిలో సెల్ఫీ దిగుతున్న మహిళలు, చిన్నారులు


పుష్కర స్నానానికి వస్తున్న భక్తజనం


షటిల్ బస్సుల్లో తిరుగు ప్రయాణానికి..

మావోయిస్టుల మృతదేహాలను అప్పగించాలి

- మానవ హక్కుల వేదిక డిమాండ్

హన్మకొండ: ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఈనెల 21న ఛత్తీస్‌గఢ్ అబుజ్‌మడ్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు చనిపోయారని, ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన సజ్జ వెంకటనాగేశ్వరరావు (రాజన్న), వన్నాడ విజయలక్ష్మి (భూమిక), గోనెగండ్ల లలిత (సంగీత), బుర్ర రాకేశ్ (వివేక్) ఉన్నారని వారు సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. వీరి కుటుంబీకులు, బంధువులు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ పీఎస్, ఆస్పత్రి ఎదుట ఐదు రోజులుగా పడిగాపులు కాస్తున్నా అక్కడి పోలీసులు మృతదేహాలను అప్పగించడం లేదన్నారు. ఉదయం, సాయంత్రం అంటూ కాలం వెల్లదీస్తూ మృతదేహాలను అప్పగించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వెంటనే మావోయిస్టు మృతదేహాలను కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

సరస్వతి మాతకు భక్తజన 'హారతి'..

- పాల్గొన్న 30 వేల మంది భక్తులు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో 12 రోజుల పాటు జరిగిన సరస్వతీనది పుష్కరాలు అట్టహాసంగా ముగిశాయి. సోమవారం రాత్రి సరస్వతిఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతిమాత విగ్రహం ఎదుట ఏడుగురు కాశీపండితులు తొమ్మిది నవరత్న మాల హారతి కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని తిలకించడానికి సుమారు 30వేల మంది భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో పుష్కరాలను విజయవంతం చేశారని అధికారులను అభినందించారు. దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ మాట్లాడుతూ అందరి సహకారంతో పుష్కరాలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

29 నుంచి ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్

విద్యారణ్యపురి: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఎక్కువశాతం పరీక్షలు పూర్తయ్యాయి. ఈ క్రమంలో ఈనెల 29 నుంచి మొదటి దశలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ నిర్వహించబోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్క హనుమకొండ జిల్లా కేంద్రంలోనే స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్‌నకు ఇంటర్‌బోర్డు అవకాశం కల్పించింది. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ (కోఎడ్యుకేషన్) లోనే క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంపునకు ఇప్పటికే వివిధ సబ్జెక్టుల పరీక్షల జవాబుపత్రాలు వచ్చాయి. ఇంకా రానున్నాయి.ఈ క్యాంప్ ఆఫీసర్‌గా హనుమకొండ డీఐఈఓ ఎ. గోపాల్ వ్యవహరిస్తున్నారు. ఈనెల 29 నుంచి మొదటిదశలో సంస్కృతం, ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, పొలిటికల్‌సైన్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల జవాబుపత్రాల వాల్యుయేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు క్యాంప్ ఆఫీసర్ ఎ.గోపాల్ తెలిపారు. రెండో దశ వాల్యుయేషన్ ప్రక్రియ ఈనెల 31నుంచి ప్రారంభం కానుంది. బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ సబ్జెక్టుల ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల జవాబుపత్రాల వాల్యుయేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు.

పుష్కరాలను చాలెంజ్‌గా తీసుకున్నాం

- 30 లక్షల మంది భక్తుల పుణ్యస్నానాలు
- ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నృత్యం చేస్తున్న కళాకారులు, సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర ప్రముఖులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరిగిన సరస్వతీనది పుష్కరాలను చాలెంజ్‌గా తీసుకున్నామని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం సాయంత్రం సరస్వతి ఘాట్ వద్ద రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తమకు భగవంతుడు పుష్కరాలు నిర్వహించే అవకాశం కల్పించాడని, రూ. 40 కోట్లతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పుష్కరాలకు ప్రాతినిథ్యం వహించడం సంతోషంగా ఉందన్నారు. 15 నుంచి 26వ తేదీ వరకు జరిగిన పుష్కరాలకు ఈ ప్రాంత ప్రజలు ఆశీస్సులు అందించారని అభినందించారు. కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం తక్కువ సమయంలో ముఖ్యమంత్రి ఆలోచన మేరకు చేసిన పుష్కరాలు దిగ్విజయం అయ్యాయని తెలిపారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతి సంగమంలో మొదటిసారి పుష్కరాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. సరస్వతి మాతా 17 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 30 లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలు చేశారని, ఈ ప్రాంతానికి అన్ని లక్షల మంది ఎన్నడూ రాలేదని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీరు, అన్నదానం చేశారని అభినందించారు. మీడియా ద్వారా లక్షలాది మంది భక్తులు వచ్చేలా ప్రచారం చేశారని, టీవీ ఛానళ్ల ద్వారా వీక్షించే అవకాశం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. శాఖల సమన్వయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పుణ్య స్నానాలు సంవత్సరం పాటు చేసేందుకు అవకాశం ఉందని, రాలేని భక్తులు సంవత్సర కాలంలో ఎప్పుడైనా పుష్కర స్నానాలు చేయొచ్చని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ చాలా తక్కువ సమయంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ప్రత్యేక చొరవతో ముందస్తు ప్రణాళిక ద్వారా అధికారులకు సూచనలు చేస్తూ సరస్వతీనది పుష్కరాలు విజయవంతానికి కృషి చేశారని అభినందించారు. రానున్న గోదావరి పుష్కరాలకు శాశ్వత సదుపాయాలు కల్పిస్తామని, పుష్కరాల ముగింపు సందర్భంగా చిరుజల్లులు కురవడంతో ఆ దేవతల అనుగ్రహం అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ మాట్లాడుతూ శ్రీ కాళేశ్వరముక్తీశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం చిన్న గ్రామమని, ఈ గ్రామంలో సరస్వతీనది పుష్కరాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. 5 నెలల ముందు నుంచి ప్రణాళికలు సిద్ధం చేశామని అందుకు అనుగుణంగా ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈనిధులతో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. పుష్కరాల నిర్వహణకు సహకరించిన స్థానికులు, అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశ్రీ నాగఫణి శర్మ, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మదన్ మోహన్, మక్కాన్ సింగ్, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్ రావు, ఎస్పీ కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు.

చనిపోతూ ఇతరులకు ప్రాణం

- యువకుడి అవయవాలు దానం
- మృతుడి తల్లిదండ్రుల ఔదార్యం


మృతుడు అజ్మీరా రాజశేఖర్

మహబూబాబాద్ రూరల్ : తాను చనిపోతూ ఓ యువకుడు ఇతరులకు తన అవయవాలు దానం చేసి ఆదర్శంగా నిలిచాడు. ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. మహబూబాబాద్ మండలం చిన్నకృష్ణాపురం గ్రామానికి చెందిన అజ్మీరా మంగ్యా, విజయ దంపతుల పెద్ద కుమారుడు రాజశేఖర్ (21) హైదరాబాద్‌లో డిగ్రీ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో రాజశేఖర్ ఈ నెల 21వ తేదీన తన బైక్‌పై వెళ్తుండగా మరో వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజశేఖర్‌కు తీవ్ర గాయాలుకాగా వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా 23వ తేదీన బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు గుర్తించారు. దీంతో జీవన్ దాన్ ట్రస్ట్ నోడల్ అధికారి శ్రీభూషణ్ రాజు అతడి కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. కొడుకుని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నా మంగ్యా, విజయ దంపతులు అతడి అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. లివర్, కిడ్నీలు, కార్నియా దానం చేసి ఇతరులకు ప్రాణం పోశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందిస్తూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. గ్రామస్తులు అజ్మీరా వెంకన్న, కిశోర్, రవికుమార్, రమేశ్, భాస్కర్, సంత్రి, లచ్చు, సైదులు, బద్రి, వీరన్న, మంగి, శారద, బాలరాజు, మాజీ సర్పంచ్ గుగులోత్ రవి, తదితరులు రాజశేఖర్ మృతదేహాన్ని ఈ నెల 24వ తేదీన గ్రామంలో ఖననం చేశారు. మృతుడి పేరిట 12 అడుగుల స్తూపం నిర్మించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఒప్పుకున్న ప్రకారమే డబ్బు చెల్లించాలి..

ప్రస్తుతం బంగారానికి ఉన్న ధర ఇవ్వాలి.. తక్కువ చెల్లించొద్దు
- బంగారం బాధితుల డిమాండ్
- ఎస్‌బీఐ ఎదుట, జాతీయ రహదారిపై ఆందోళన


బాధితులతో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు


పురుగులమందు డబ్బాతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితుడు

రాయపర్తి: బ్యాంకులో దాచుకున్న బంగారం చోరీకి గురైందని, ఈ విషయంలో బ్యాంకు అధికారులు డబ్బు చెల్లిస్తామని ఒప్పుకున్నారని, ఆ ప్రకారమే ప్రస్తుతం బంగారానికి ఉన్న ధర చెల్లించాలని పలువురు ఖాతాదారులు డిమాండ్ చేశారు. తక్కువ ధర చెల్లిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం మండలకేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట, అనంతరం వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని ఎస్‌బీఐలో గతేడాది నవంబర్ 18న బ్యాంకులో 495 మందికి చెందిన 19కిలోల బంగారం చోరీకి గురైన విషయం విదితమే. ఈఘటనలో పోలీసులు ఏడుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 2 కిలోల 520 గ్రాముల బంగారం రికవరీ చేశారు. బాధితులు అధైర్యపడొద్దని, న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. గత నెలలో తులానికి రూ.95వేల చొప్పున ఇస్తామని చెప్పడంతో బాధితులు ఒప్పుకున్నారు. ఈ క్రమంలో 87 మంది పేర్లు ఉన్నతాధికారులకు పంపారు. అందులో కొంత మందికి రూ.92వేలు, మరి కొంతమందికి రూ.87వేలు పలు రకాలుగా రావడంతో తక్కువ వచ్చినవారు వద్దని, ఎక్కువ వచ్చినవారు లెక్క చూసుకుని వెళ్లారు. ఈ క్రమంలో రూ.95వేలు ఒప్పుకున్న బ్యాంకు అధికారులు ప్రస్తుతం తక్కువ ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారంటూ బ్యాంకు ఎదుట తర్వాత వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై గంటపాటు ఆందోళన చేపట్టారు. వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సైలు చందర్, శ్రవణ్‌కుమార్ బాధితులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. ఘటనాస్థలికి చేరుకున్న బ్యాంకు ఆర్‌ఎం రహీమ్‌ను బాధితులు తమకు న్యాయం చేయాలంటూ నిలదీశారు. ఒప్పుకున్న డబ్బు ఇవ్వాలని, కోత విధించవద్దని కోరారు. దీనిపై ఆర్‌ఎం స్పందిస్తూ బాధితుల వివరాలను ఉన్నతాధికారులకు పంపామని, ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని వివరించారు.

తక్కువ చెల్లిస్తే ఒప్పుకోం..



రాయపర్తి ఎస్‌బీఐలో 40 గ్రాముల బంగారం తాకట్టు పెట్టాం. అయితే బ్యాంకులో బంగారం చోరీకి గురైనప్పటి నుంచి అధికారులు మాకు న్యాయం చేస్తామంటూ దాటవేస్తున్నారు. గత నెలలో తులానికి రూ.95వేలు ఇస్తామని చెప్పారు. ప్రస్తుతం రూ.87వేలు ఇస్తామని చెబుతున్నారు. దీనికి ఒప్పుకోం. ఒప్పుకున్న ప్రకారం ఇవ్వని పక్షంలో మా బంగారం మాకు ఇవ్వాలి.

-ముద్రబోయిన సుధాకర్, బాధితుడు, రాయపర్తి

పీహెచ్‌డీ పట్టాలకు ఫీజు..

గత స్నాతకోత్సవానికి రూ. వెయ్యి చెల్లించిన అభ్యర్థులు
- ఇందులో 56 మందికే 'డాక్టరేట్' ప్రదానం
- మిగతా వారికి ఈ స్నాతకోత్సవంలో అందజేయనున్న అధికారులు
- జూలై 7న కేయూ 23వ స్నాతకోత్సవం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2022 ఆగస్టు 25న స్నాతకోత్సవం నిర్వహించారు. అప్పట్లో ఆర్ట్స్, సోషల్‌సైన్స్, సైన్స్, కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ, 'లా' , ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ విభాగాల్లో పీహెచ్‌డీలు పొందిన అభ్యర్థులు 2022 ఆగస్టు మూడోవారం వరకు పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. రూ. వెయ్యి చొప్పున ఫీజు చెల్లించారు. అయితే అప్పటి రాష్ట్ర గవర్నర్ తమిళిసైసౌందరరాజన్ స్నాతకోత్సవంలో పాల్గొనే సమయం తక్కువ ఉంటుందని, అందుకే 2019 డిసెంబర్ 31వరకు ఆయా విభాగాల్లో పీహెచ్‌డీలు పొందిన 56మంది అభ్యర్థులకే పట్టాలు ప్రదానం చేయించారు.దీంతో స్నాతకోత్సవం 2022 ఆగస్టు 25నాటికి వారం రోజుల ముందు వరకు 2020 జనవరి1నుంచి పీహెచ్‌డీలు పొందిన అభ్యర్థుల్లో చాలామంది రూ. వెయ్యి చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసినవారికి ప్రదానం చేయలేదు.వారిలో ఎక్కువమంది కేయూ 23వ స్నాతకోత్సవం కోసం నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు 2 సంవత్సరాల 9 నెలల తర్వాత మళ్లీ కేయూ 23వ స్నాతకోత్సవం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.ఈమేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కేయూ వీసీ కె ప్రతాప్‌రెడ్డి ఇటీవల కలిశారు. జూలై 7న ముహూర్తం ఖరారు చేశారు. రాష్ట్ర గవర్నర్ కూడా స్నాతకోత్సవం వచ్చే అవకాశాలున్నాయి.

పీహెచ్‌డీ పట్టాలు పొందేందుకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

గతంలో పట్టాలు పొందని అభ్యర్థుల గురించి పట్టించుకోకుండానే ఇటీవల 2020 జనవరి 1నుంచి 2025 మే 31వరకు ఆయా విభాగాలల్లో పీహెచ్‌డీలు పొందిన అభ్యర్థులు కేయూ 23వ స్నాతకోత్సవంలో పట్టాలు పొందేందుకు రూ. వెయ్యి చొప్పున చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రకటన విడుదల చేశారు. దీంతో గత 22వ స్నాతకోత్సవం సందర్భంగా రూ. వెయ్యి చొప్పున ఫీజు చెల్లించామని, అప్పటి స్నాతకోత్సవంలో తమకు పట్టాలు ప్రదానం చేయలేదని పలువురు సోమవారం పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మళ్లీ రూ. వెయ్యి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ వారికి తెలిపారు.

అలా ఎంతమంది ఉన్నారనే అంశంపై లెక్కలు

కేయూ 22వ స్నాతకోత్సవం సందర్భంగా ఆయా విభాగాలకు సంబంధించి ఫీజు చెల్లించి డాక్టరేట్ పట్టాలు పొందని అభ్యర్థులు ఎంతమంది ఉన్నారనే అంశంపై ప్రస్తుతం లెక్కలు తీస్తున్నారు. ఎందుకంటే 2 సంవత్సరాల 9నెలలు గడిచిపోయాయి. అందులోకొంతమంది ఆ తర్వాత అవసరం నిమిత్తం పట్టాలు తీసుకెళ్లి ఉంటారా లేదా అని చూస్తున్నారు. ఎక్కువశాతం మంది మాత్రం స్నాతకోత్సవంలోనే పట్టాలు పొందేందుకు అలాగే ఉన్నారని సమాచారం. అందుకు సంబంధించిన జాబితా రూపొందించి ఆయా అభ్యర్థులకు కూడా ఈ జూలై 7న జరిగే స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ చెప్పారు. కాగా, 2020 జనవరి 1నుంచి 2025 మేలో ఇప్పటివరకు అవార్డు అయిన అభ్యర్థులు 573మంది ఉన్నారు.

ట్రావెల్స్ బస్సులో మంటలు..

భూపాలపల్లి అర్బన్: సరస్వతీనది పుష్కరాలకు హాజరై తిరిగి వెళ్తున్న ఏసీ ట్రావెల్స్ బస్సులో సోమవారం మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శాఖ డీఎఫ్ఓ భగవన్‌రెడ్డి కథనం ప్రకారం.. సిరిసిల్ల జిల్లాకు చెందిన ఏసీ ట్రావెల్స్ బస్సు 30 ప్రయాణికులతో కాళేశ్వరం సరస్వతీనది పుష్కరాలకు హాజరై వెళ్తోంది. ఈ క్రమంలో మహదేవపూర్ మండలంలోని మద్దులపల్లి–అన్నారం గ్రామాల మధ్య బస్సులో మంటలు చెలరేగాయి. ఏసీ నుంచి మంటలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై భక్తులను వెంటనే కిందికి దింపి అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ ప్రమాదంలో బస్సులో సీట్లు, రెండు టైర్లు దగ్ధమయ్యాయి. మహదేవపూర్, భూపాలపల్లి అగ్నిమాపక అధికారులు రవి, కుమారస్వామి ఆధ్వర్యంలో రెండు ఫైరింజన్ల సాయంతో మంటలు ఆర్పారు.